సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 22 । ఆగస్టు । 2023

నాగమ్మ దీవించు



సిరిసిల్లటౌన్: 'నాగమ్మ దీవించు' అంటూ మహిళలు జిల్లా వ్యాప్తంగా నాగుల పంచమిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ స్థానిక శివసాయిబాబా ఆలయ ప్రాంగణంలో నాగదేవతకు పూజలు చేశారు. స్థానిక శివసాయిబాబ, మదేలేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి, రేణుక ఎల్లమ్మ, అంబికానగర్, సంతోషిమాత ఆలయాల వద్ద పుట్టల్లో నాగదేవతకు మహిళలు పూజలు చేశారు.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్‌సెల్‌తో సత్వరన్యాయం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ఆఫీస్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 12 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిపై వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు సమాచారం ఇచ్చి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేను కలిసిన జెడ్పీ వైస్‌చైర్మన్



పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

ఇల్లంతకుంట(మానకొండూర్): మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఎమ్మెల్యే టికెట్ దక్కడంపై జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఎల్‌ఎండీ క్యాంపులో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎంద్ర చందన్ ఉన్నారు.

'ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వకుంటే రాజీనామాలు'

ముస్తాబాద్(సిరిసిల్ల): నామినేటెడ్ పదవుల్లో ముస్తాబాద్ పట్టణ నాయకులకు ప్రాధాన్యత కల్పించాలని నెల రోజులుగా బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న విజ్ఞప్తులు, అలకలు తారాస్థాయికి చేరుకున్నాయి. ముస్తాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అధిష్ఠానం తమ ఉద్యమ చరిత్రను, పార్టీకి చేసిన సేవలను గుర్తించకుండా, పోతుగల్ ఏఎంసీ చైర్మన్ పదవిని మరొకరికి కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ పదవిని ముస్తాబాద్ వాసులకు ఇవ్వకుంటే బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని తీర్మానించారు. కొందరి పెత్తనం వల్లే ముస్తాబాద్ బీఆర్‌ఎస్ పతనం అంచులకు చేరుతోందని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్‌ను తప్పుదోవ పట్టించి ముస్తాబాద్‌లో నాయకులు ఎదగకుండా కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ ఇప్పటికైన ముస్తాబాద్ వాసులకు పదవులు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ గాండ్ల సుమతి, మాజీ సర్పంచ్ మట్ట రాజిరెడ్డి, మట్ట రాణి, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, రమేశ్‌రెడ్డి, అపర్ణ, రేణుక, రాజు, తాళ్ల రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జిలెటిన్‌స్టిక్స్ నిల్వచేసిన వ్యక్తి అరెస్ట్



జిలిటెన్‌స్టిక్స్ పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ప్రజల నివాస ప్రదేశాల్లో అక్రమంగా జిలెటిన్‌స్టిక్స్ నిల్వచేసిన వ్యక్తిని పోలీసులు సోమ వారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. సూర్యపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన ఓర్సు బంగారయ్య ప్రస్తుతం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలలో ఉంటున్నాడు. బంగారయ్య ఇంట్లో తనిఖీ చేయగా పెద్ద ఎత్తున జిలెటిన్‌స్టిక్స్, కార్డెక్స్‌వైర్ లభించాయి. దీనిపై బంగారయ్యను విచారించి కొన్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మరిన్ని వివరాలు కోసం ఆరా తీస్తున్నారు.



కేటీ రామారావు (సిరిసిల్ల)




గంగుల కమలాకర్(కరీంనగర్)



కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి)



సుంకె రవిశంకర్ (చొప్పదండి)



రసమయి బాలకిషన్ (మానకొండూర్)



ఎం. సంజయ్ (జగిత్యాల)



ఒడితెల సతీశ్(హుస్నాబాద్)



పుట్ట మధు (మంథని)



కె. చందర్(రామగుండం)



మనోహర్ రెడ్డి (పెద్దపల్లి)

◄ పాతకాపులు



ఇన్ ►



పాడి కౌశిక్ రెడ్డి (హుజూరాబాద్)



కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల)



చల్మెడ లక్ష్మీనర్సింహారావు(వేములవాడ)

- వేములవాడ, హుజూరాబాద్, కోరుట్లకు నూతన అభ్యర్థులు
- మిగిలిన పదిస్థానాల్లో పాత నాయకులే
- 13లో ఏడుగురు ఓసీ, ముగ్గురు బీసీ, ముగ్గురు ఎస్సీ నేతలు
- మూడోసారి టికెట్ దక్కించుకున్న ఏడుగురు సీనియర్లు
- వివాదాలున్న స్థానాల్లో పాతకాపులే

కారులో ముగ్గురు కొత్తవారు!

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

భారత రాష్ట్రసమితి(బీఆర్‌ఎస్) తన అభ్యర్థులను ప్రకటించింది. 13 అసెంబ్లీ స్థానాలున్న విశాల ఉమ్మడి జిల్లా అభ్యర్థుల జాబితాను సోమవారం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రకటించగానే.. పాత జిల్లాలో గులాబీ శ్రేణుల సంబురాలు మొదలయ్యాయి. ఇటీవల జాబితాలో ఉమ్మడి జిల్లాలో భారీగా మార్పులు ఉంటాయని ప్రచారం జరిగిన నేపథ్యంలో సీఎం జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కానీ.. పాత జిల్లాలో పదిమందిని పాత వారిని, ముగ్గురు కొత్తవారి పేర్లు ప్రకటించి సీఎం.. అందరి అంచనాలను తలకిందులు చేశారు. అంతా ఊహించినట్లుగా వేములవాడ అభ్యర్థిని అందరి కంటే ముందే మారుస్తున్నామని సీఎం ప్రకటించారు. పౌరసత్వం వివాదంలో ఆయన మార్పు అనివార్యమైందని వివరించారు. ఆయన స్థానంలో చెలిమెడ లక్ష్మీనర్సింహారావు పేరును ఖరారు చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు డాక్టర్ కె.సంజయ్‌ను ప్రకటించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యాసాగర్‌రావు కోరిక మేరకు సంజయ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇక హుజూరాబాద్‌లో అంతా అనుకున్నట్లుగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు సిట్టింగులను మార్చగా ఇందులో జిల్లాకు చెందినవారే ఇద్దరు కావడం విశేషం.

పదిమంది పాతకాపులే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో మూడుస్థానాల్లో అభ్యర్థులు మారగా, మిగిలిన 10 స్థానాల్లో సీనియర్లే ఉన్నారు. అందులో సిరిసిల్ల నుంచి మంత్రి కేటీఆర్, కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్, ధర్మపురి నుంచి మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీచేస్తారు. చొప్పదండి నుంచి సుంకె రవిశంకర్, మానకొండూరు నుంచి రసమయి బాలకిషన్, హుస్నాబాద్ నుంచి సతీశ్‌బాబు, జగిత్యాల నుంచి సంజయ్, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు బరిలో దిగనున్నారు. ఇందులో సిరిసిల్ల, కరీంనగర్, హుస్నాబాద్, మానకొండూరు, జగిత్యాల మినహా మిగిలిన చొప్పదండి, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథనిలో ఎమ్మెల్యేలకు వ్యతిరేక పవనాలు వీచాయి. మంత్రి ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంటుకు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అదే సమయంలో చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా స్థానిక నేతలు తిరుగుబాటు చేశారు. మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ఈశ్వర్‌ల చొరవతో అవన్నీ సద్దుమణిగాయి.

కులాల వారీగా..

13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు ఓసీ అభ్యర్థులు ఉన్నారు. ముగ్గురు బీసీలు, ముగ్గురు ఎస్సీలకు అవకాశం దక్కింది. ఇందులో కేటీఆర్, డాక్టర్ సంజయ్, డాక్టర్ కె.సంజయ్‌కుమార్, చలిమెడ లక్ష్మీనర్సింహారావు వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు. పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌ది రెడ్డి సామాజిక వర్గం. హుస్నాబాద్ నుంచి సతీశ్‌బాబు బ్రాహ్మణ(కరణం) కాగా, కరీంనగర్ నుంచి కమలాకర్, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు.. ఈ ముగ్గురూ మున్నూరుకాపు సామాజికవర్గం వారు కావడం విశేషం. సుంకె రవిశంకర్ (చొప్పదండి), రసమయి బాలకిషన్(మానకొండూరు) మాదిగ, కొప్పుల ఈశ్వర్(ధర్మపురి) మాల సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం.

ఏడుగురు మూడోసారి...

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాతజిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు నాయకులు బీఆర్‌ఎస్ టికెట్‌పై మూడోసారి పోటీ చేస్తున్నారు. అందులో కేటీఆర్(సిరిసిల్ల), సతీశ్‌బాబు(హుస్నాబాద్), మనోహర్‌రెడ్డి(పెద్దపల్లి), పుట్ట మధు(మంథని), గంగుల కమలాకర్ (కరీంనగర్), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), రసమయి బాలకిషన్ (మానకొండూరు) ఉన్నారు. డాక్టర్ సంజయ్(జగిత్యాల), సుంకె రవిశంకర్(చొప్పదండి) రెండోసారి బీఆర్‌ఎస్ టికెట్‌పై బరిలోకి దిగనున్నారు. ఇక మిగిలిన నలుగురు లక్ష్మీనర్సింహారావు(వేములవాడ), పాడికౌశిక్‌రెడ్డి(హుజూరాబాద్), డాక్టర్ కె.సంజయ్ (కోరుట్ల), కోరుకంటి చందర్(రామగుండం) తొలిసారిగా బీఆర్‌ఎస్ బీఫాం మీద పోటీ చేయనున్నారు.

జిల్లాలో ఓటర్లు 4,46,399

- వేములవాడలో 2,13,284
- సిరిసిల్లలో 2,33,115



ఓటర్ల జాబితాను వెల్లడిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం వెల్లడించారు. కలెక్టరేట్‌లో అఖిలపక్షం నేతలతో సమావేశమైన అదనపు కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్ స్పెషల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఆఫ్ ఎలక్టోరల్స్‌ను వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 2,13,284 కాగా.. మహిళలు 1,10,091, పురుషులు 1,03,127, థర్డ్ జెండర్ 18, సర్వీసు ఓటర్లు 50 మంది ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,33,115 కాగా.. మహిళా ఓటర్లు 1,18,639, పురుషులు 1,14,370, థర్డ్ జెండరు లేరు, సర్వీసు ఓటర్లు 106 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 11,089 మంది ఎక్కువగా ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు ఇంకా అవకాశం ఉంది. అక్టోబరు 4న తుది ఓటర్ల జాబితాను వెల్లడించనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు రహమాన్, పాషా, బీఆర్‌ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు లింగంపల్లి మధుకర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపిక



సహచర క్రీడాకారులతో శేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గిట్టిముక్కల శేఖర్ ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం జరిగిన 100 మీటర్ల పరుగుపందెంలో రాణించి రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. నిరంతర విద్యాబోధన చేస్తూనే క్రీడల్లో రాణించడంపై పలువురు అభినందించారు.

లక్కీడ్రా గందరగోళం



లక్కీ డ్రా తీస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



వైన్స్ దక్కిన ఆనందంలో వ్యాపారులు

- తడబడిన అధికారులు
- ఆందోళనపడ్డ వ్యాపారులు
- ముగిసిన వైన్స్ డ్రా

సిరిసిల్లక్రైం: జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు సోమవారం నిర్వహించిన లక్కీడ్రా గందరగోళంగా మారింది. లక్కీడ్రాలో వెళ్లిన నంబర్ చెప్పడంలో అధికారులు తడబడడంతో వ్యాపారులు ఆందోళన పడ్డారు. లక్కీ డ్రా నిర్వహించిన హాల్‌లో ఏర్పాట్లు సరిగ్గా చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు విజయవంతంగా లక్కీడ్రా ద్వారా చేపట్టిన ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు.

మీడియాకు అనుమతి ?

జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు 2,036 టెండర్లు వచ్చాయి. వీటన్నింటికి సోమవారం లక్కీడ్రా ద్వారా 48 మంది లైసెన్స్ వ్యాపారులను అధికారులు ఎంపిక చేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన లక్కీడ్రా అంతా గందరగోళంగా మారింది. వ్యాపారులు, దరఖాస్తుదారుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోయారు. ఒక పద్ధతి ప్రకారం డ్రా నిర్వహించకపోవడంపై విమర్శలు వచ్చాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ సమక్షంలో డ్రా విధానంలో మద్యం వ్యాపారులను ఎంపిక చేశారు.

తడబడిన అధికారి

లక్కీ డ్రాలో ఎంపికైన వారి వివరాలు వెల్లడించడంలో జిల్లా ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి పంచాక్షరీ తప్పిదాలు చేశారు. 4 గెజిట్ నంబర్ వైన్‌షాప్‌ను ముందుగా 11వ టోకెన్ నంబర్‌కు వచ్చిందని చెప్పి.. మళ్లీ సవరించుకొని టోకెన్ నంబర్ 13కు వచ్చిందన్నారు. 14 గెజిట్ షాప్ 11వ టోకెన్ నంబర్‌కు వచ్చిందని ప్రకటించి వెంటనే టోకెన్ నంబర్ 71కు వచ్చినట్లు వెల్లడించారు.

గొల్లపల్లిలో ముగ్గురికి వైన్‌షాపులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):మండలంలోని గొల్లపల్లికి చెందిన ముగ్గురు యువకులకు లక్కీ డ్రాలో మూడు మద్యం దుకాణాలు దక్కాయి. ఒక్కొక్కరికి ఒక్కోచోట వైన్‌షాపు వచ్చింది. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లాటరీలో గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త దొంత మనోహర్ ఎల్లారెడ్డిపేటలోని ఓ షాపును దక్కించుకున్నాడు. బీఆర్‌ఎస్ కార్యకర్త, వార్డు సభ్యుడు పాటి దేవయ్యకు వేములవాడలోని ఒక షాపు దక్కింది. అదే గ్రామానికి చెందిన మరొకరు బీజేపీ నాయకుడు దాసరి గణేశ్‌కు గన్నేరువరంలో వైన్‌షాపు దక్కింది.

బీఆర్‌ఎస్.. ఫుల్‌జోష్

- సిరిసిల్ల, వేములవాడల్లో సంబరాలు
- మాదంతా ఒకే కుటుంబం
- వేములవాడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడలో బైక్‌ర్యాలీ



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు



సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నేతల్లో ఫుల్‌జోష్ నిండింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా చెన్నమనేని రమేశ్‌బాబు స్థానంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావును సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సంబురాలు చేసుకున్నారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు నాంపల్లి వద్ద స్వాగతం పలికారు. మల్లారం జంక్షన్ నుంచి నందికమాన్ వరకు 200 బైక్‌లతో ర్యాలీ తీశారు. రాజన్న గుడి ముందు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. లక్ష్మీనర్సింహారావు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఇంటికెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, నాయకులు మాదాడి గజానందరావు, నిమ్మశెట్టి విజయ్ పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో సిరిసిల్లలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. వరుసగా ఐదోసారి సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా కేటీఆర్‌ను ప్రకటించడంపై నాయకులు టపాసులు పేల్చి.. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అభివృద్ధిలో సిరిసిల్లను దేశంలోనే అగ్రస్థానంలో ఉంచిన మంత్రి కేటీఆర్‌ను ప్రజలు మళ్లీ ఆశీర్వదిస్తారని బీఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. షేక్ సికిందర్, కొలనూరి సుధీర్, గుజ్జె దత్తాద్రి ఉన్నారు.

ఆసాముల ఆందోళన బాట

- పింజర్ల డబ్బులు ఇవ్వాలని డిమాండ్
- రేపటి నుంచి సమ్మెకు నిర్ణయం



నిరసన తెలుపుతున్న ఆసాములు

సిరిసిల్ల: సిరిసిల్లలో వస్త్రోత్పత్తిని సాగించే ఆసాములు ఆందోళన బాట పట్టారు. పాలిస్టర్ అసోసియేషన్ ఆఫీస్ ముందు సోమవారం నిరసన తెలిపారు. ఆసాములకు 2021 నాటి పింజర్ల సబ్సిడీ డబ్బులను నెల రోజుల్లో ఇస్తామని 2023 ఏప్రిల్ 19న పాలిస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ఒప్పందం చేశారు. ఈమేరకు టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం సమక్షంలో ఒప్పందం జరిగింది. మే 20లోగా పింజర్ల డబ్బులు ప్రభుత్వం ద్వారా ఇప్పించేందుకు ప్రయత్నిస్తామని, జౌళిశాఖ ద్వారా డబ్బులు రాకపోయినా.. యజమానులే భరించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈమేరకు గతంలో బతుకమ్మ చీరలకు పింజర్ల డబ్బులు ఎంత వచ్చాయో ఆమేరకు యజమానులు చెల్లించాలని ఏప్రిల్ 19న జరిగిన ఒప్పందంలో ఉంది. కానీ నాలుగు నెలలైనా ఒప్పందం అమలు కాలేదు. సిరిసిల్లలో 50 మంది ఆసాములు పాలిస్టర్ అసోసియేషన్ ముందు ఆందోళన చేశారు. బుధవారం నుంచి మూడు వేల మంది ఆసాములు సమ్మె చేయాలని నిర్ణయించారు. ఆందోళనలో ఆసాముల ప్రతినిధులు సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్, మండల రాజు, కొండ సుభాష్ పాల్గొన్నారు.

బుజ్జగించే ప్రయత్నం

ఆసాములు ఆందోళనకు దిగడంతో పాలిస్టర్ అసోసియేషన్ పెద్దలు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని, అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరుతున్నారు. గతంలో చేసిన ఒప్పందాన్ని ఉల్లంఘించిన యజమానుల మాటలను నమ్మేందుకు ఆసాములు సిద్ధంగా లేరు. ప్రభుత్వం నుంచి పింజర్ల డబ్బులు వచ్చిన తరువాత మీరే తీసుకోండి.. అప్పటి వరకు మా లెక్కలను రాసుకోండి అంటూ.. ఆసాములు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా.. సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తి తుది దశకు చేరుతున్న తరుణంలో ఆసాములు ఆందోళనకు దిగడం చర్చనీయాంశమైంది.

టిక్కెట్టు రాలేదని బాధపడొద్దు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: టిక్కెట్టు రాలేదని ఎవరూ బాధపడొద్దని, సవాళ్లు వచ్చినప్పుడే ధీటుగా నిలబడాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ టికెట్లు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం రాత్రి తన అనుచరులకు జర్మనీ నుంచి ఓ ప్రకటనలో ఇలా తెలిపారు. పౌరసత్వం వివాదం కారణంగా టికెట్ ఇవ్వలేదనడం సరైంది కాదని, అక్టోబర్‌లో కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పలు సర్వేల ఆధారంగా సీఎం కేసీఆర్ ఉత్తమంగా కొనియాడడం దశాబ్దకాల నిస్వార్థ ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే పదవిచ్చిన నియోజకవర్గం కాదు.. ఈ ప్రాంత ప్రజలతో పెనవేసుకున్న సుదీర్ఘ రాజకీయ పేగుబంధంగా చెప్పుకొచ్చారు. రానున్న రెండు నెలల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చేందుకు కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. పౌరసత్వం కేసు వాదనలు పూర్తయ్యాయని.. తీర్పు కోసం వేచి ఉన్నామని స్పష్టం చేశారు. త్వరలో ఈ అంశంపై మీ అందరితో చర్చిస్తానని తెలిపారు. ఎవరూ అధైర్యపడొద్దని, మనందరి భవిష్యత్తు కార్యక్రమంపై కలసికట్టుగా నిర్ణయం తీసుకుందామని ప్రకటించారు.

రాజన్న దర్శనం కోసం..



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



బారులు తీరిన జనం



మహాలింగార్చన

వేములవాడ: శ్రావణ సోమవారం కావడంతో రాజన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. రద్దీ పెరగడంతో ఒక్కో భక్తుడి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శావణ సోమవారం సందర్భంగా సాయంత్రం మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్ శాలువాతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నంకెపల్లి పవన్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు సూచించారు. ఇల్లంతకుంటలోని పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఆస్పత్రికొచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణుల నమోదు పెంచాలని, ప్రభుత్వాస్పత్రిలోనే సుఖప్రసవాలు జరిగేలా చూడాలని కోరారు. వైద్యాధికారులు రమేశ్, శరణ్య, ఆయుష్ వైద్యాధికారిణి శరణ్య ఉన్నారు.

చికిత్స పొందుతున్న చిన్నారికి సాయం

కోనరావుపేట(వేములవాడ): ఊపిరితిత్తుల సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి రూ.10 వేల సాయాన్ని అందజేశారు. మండలంలోని నిజామాబాద్‌కు చెందిన గాజుల సత్యం–రజిత దంపతుల కూతురు సాన్విక న్యుమోనియాతో బాధపడుతూ సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దినసరి కూలీగా పనిచేసే సత్తయ్య వైద్య ఖర్చులకు సైతం డబ్బులు లేవు. ఈ విషయం తెలుసుకున్న సిరిసిల్ల కార్మికసంఘం నాయకుడు అక్కెనపల్లి భాస్కర్ రూ.10వేలు సోమవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. సుధాకర్, షేక్ జహీర్, సతీశ్ ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని, పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్‌తోనే సమన్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. త్వరలోనే గడప..గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జలగం ప్రవీణ్, దొమ్మాటి నర్సయ్య, ఎల్ల బాల్‌రెడ్డి, ఎండీ హమీద్, శ్రీనివాస్, సద్ది లక్ష్మారెడ్డి, లింగాల భూపతి, మునిగెల రాజు, శ్రీకాంత్, గజ్జల రాజు, నాగరాజు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి బరాత్‌లో ఘర్షణ

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాలలో ఓ పెళ్లి బరాత్‌లో డ్యాన్స్ చేస్తూ ఇరు వర్గాల యువకులు కొట్టుకున్నారు. ఈ సంఘటనలో నర్మాల, ముస్తాబాద్‌కు చెందిన 21 మంది యువకులపై కేసు నమోదు చేసి, డీజేను సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అంతకుముందు ఎస్సై యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్న వయస్సులోనే తాగుడుకు అలవాటై, గొడవలలో తలదూర్చవద్దని సూచించారు.

విదేశాల్లో బియ్యం గోస

- మార్కెట్లలో ఖాళీ అయిన నిల్వలు
- అమాంతం పెరిగిన ధరలు
- నెల రోజుల్లో రెట్టింపు
- ఇండియా నుంచి నిలిచిన సరఫరా
- గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తిప్పలు
- ఆస్ట్రేలియా, అమెరికాల్లోనూ కష్టాలు



“ఇతను ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన వంగల భార్గవ్‌రెడ్డి. ఉన్నత చదువుల కోసం ఏడాది క్రితం ఆస్ట్రేలియా వెళ్లాడు. ఇప్పటి వరకు అంతా సజావుగా ఉన్నప్పటికీ నెల రోజులుగా మార్కెట్లలో హెచ్ఎంటీ, జైశ్రీరామ్ బియ్యం దొరకడం లేదు. సూపర్‌మార్కెట్ల వద్ద క్యూలు కట్టినప్పటికీ బియ్యం లభించక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇండియాలో ఉన్న కుటుంబ సభ్యులు భార్గవ్‌రెడ్డికి ఇక్కడి బియ్యం పంపించాల్సి వస్తోంది. ఈక్రమంలో కిలో బియ్యానికి రవాణా ఖర్చు రూ.1150 చొప్పున అవుతుంది. చదువుల కోసం వెళ్లిన ఇలాంటి విద్యార్థులకు ఇక్కడి నుంచి బియ్యం పంపిస్తే ఖర్చు తడిసిమోపెడవుతుంది.



ఇతను మోతె వంశీకృష్ణారెడ్డి. గత రెండేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అమెరికాలో చదువుకుంటూనే ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మొన్నటి వరకు పరిస్థితులు బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం అక్కడ బియ్యం కొరతతో ఇబ్బందులు పడుతున్నాడు. ఇండియా నుంచి బియ్యం సరఫరా నిలిచిపోగా.. అక్కడ కొంత మంది వ్యాపారులు బియ్యాన్ని బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఆర్థికంగా భారం అవుతుంది. రెండు నెలల క్రితం 20 కిలోల బియ్యం బస్తాకు 60 డాలర్లు ఉండగా ప్రస్తుతం 70 డాలర్లకు పెరిగింది. చదువుకునేందుకు వెళ్లిన ఇలాంటి విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వంశీకృష్ణారెడ్డి తెలిపారు.”

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):గల్ఫ్ దేశాల్లో బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. ఉన్న ఊరిలో ఉపాధి లేక ఎడారి దేశాల బాట పట్టిన వలసజీవులకు బియ్యం ధరలు ఆందోళన కల్గిస్తున్నాయి. శ్రమజీవుల కష్టాలను మరింత పెంచేలా నెల రోజుల్లోనే ధరలు రెట్టింపు అయ్యాయి. బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలు అల్లాడుతున్నారు. నెల రోజులుగా బియ్యం ఎగుమతులపై నిషేధం కొనసాగుతుండడంతో గల్ఫ్ దేశాల్లోని మార్కెట్లలో బియ్యం ధరలు రెండింతలు పెరిగాయి. యూఏఈ, బహ్రెయిన్, సౌదీఅరేబియా, ఒమన్, కతార్, కువైట్ దేశాల్లో నివసిస్తున్న 15 లక్షల మంది తెలంగాణవాసులపై ఈ ధరలు ప్రభావం చూపుతున్నాయి.

నిలిచిన సరఫరా.. ఎన్‌ఆర్‌ఐల తిప్పలు

ఇండియా ప్రభుత్వం విదేశాలకు బియ్యం సరఫరాను నిలిపివేయడంతో అక్కడి మార్కెట్లలో బియ్యం నిల్వలు ఖాళీ అయ్యాయి. ఫలితంగా చదువులు, ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లిన ఎన్‌ఆర్‌ఐలు తిండికి తిప్పలు పడుతున్నారు. అక్కడి మార్కెట్లలో లభించే బాసుమతి బియ్యం ప్రతీ రోజు తినలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఫ్లైట్లలో బియ్యం పంపించడానికి కొందరి కుటుంబీకులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఖర్చు భరించలేనంతగా అవుతుంది. బ్లాక్ మార్కెట్‌లో బియ్యం అధిక ధరలకు దొరుకుతున్నాయి. ఆస్ట్రేలియాలో గతంలో 25 కిలోల సన్నబియ్యం 60 డాలర్లకు లభిస్తుండగా.. ఇప్పుడు అదే బియ్యం బస్తా 90 డాలర్లకు చేరింది. ధరలు దాదాపు రెట్టింపవడంతో ఉన్నత విద్య కోసం వెళ్లిన విద్యార్థుల వ్యయం అమాంతం పెరిగింది. అదే సమయంలో బాసుమతి బియ్యం ధరలు సాధారణ స్థాయిలో ఉండడంతో ఎక్కువ మంది వీటినే తింటున్నారు.

గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు

పొట్ట చేతపట్టుకుని అరబ్ దేశాలకు వలసపోయిన తెలంగాణ కార్మికులకు అన్నమే ప్రధాన ఆహారం. మన రాష్ట్రం నుంచి నిత్యం టన్నుల కొద్ది బియ్యం కోరుట్ల బ్రాండ్ పేరుతో ఎగుమతులు అయ్యేవి. ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో అక్కడి మార్కెట్లలో ధరలు పెంచేశారు. షార్జాలోని అబుసాగరలోని ఇండియన్ ఫ్లోర్‌మీల్స్ మార్కెట్‌లో 18 కిలోల సోనా మసూరి బియ్యం బస్తా నెల క్రితం 42 ధరమ్స్ ఉంటే ప్రస్తుతం అదే బస్తాను 72 ధరమ్స్‌కు విక్రయిస్తున్నారు. నెల క్రితం కిలో బియ్యం రూ.52.50 ఉండగా, ఇప్పుడు రూ.90.11కు పెరిగింది. మొత్తంగా కిలో బియ్యానికి రూ.37.61 పెరగడంతో అక్కడున్న వలస జీవులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గల్ఫ్ దేశాల్లో సోనామసూరి ఎక్కువ మంది ఇష్టపడే బియ్యం. అలాగే బ్రౌన్, బ్లాక్ ఇతర బియ్యం ధరలు కూడా పెరిగాయి.



బాయ్ సూపర్ మార్కెట్‌లో సోనా మసూరి



పెరిగిన ధరలను చూపుతున్న బోర్డు

కూలీలపైనే అధిక భారం

ఎలాంటి స్కిల్ లేకుండా కూలీ పనులకు వెళ్లిన వారు.. తక్కువ వేతనాలకు పనిచేసే వారిపైనే ధరల ప్రభావం పడుతుంది. ఇతర ప్రొఫెషనల్ పనులు చేసుకునే వారిపై ప్రభావం పెద్దగా లేదని దుబాయిలో ఉంటున్న కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన దయాకర్‌గౌడ్ పేర్కొంటున్నారు. కొన్ని కంపెనీల్లో భోజన సదుపాయం ఉండగా, లేబర్ క్యాంపుల్లో పనిచేసుకుని, వంట చేసుకునే వారే ఇక్కట్లు పడుతున్నారు. ఇతర దేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, ఫిలిప్పీన్స్, పాకిస్థాన్ నుంచి బియ్యం ఎగుమతులు అవుతున్నా ఇండియా నుంచే అధికంగా వెళ్తున్నాయి. కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వెళ్లిన వారు దొడ్డురకం, బ్రౌన్ రైస్‌నే తింటుంటారు. అలాగే ఉత్తర భారతం నుంచి వెళ్లిన వారు చపాతి తింటారు గనుక వారిపై బియ్యం ధరల ప్రభావం కనిపించడం లేదు. ఇదిలా ఉండగా.. తెలంగాణకు చెందిన కార్మికులు ప్రత్యామ్నాయ ఆహారం చపాతి, బన్నులపై దృష్టి పెడుతున్నట్లు తెలిసింది.

బియ్యం ఖర్చులు పెరిగాయి



మేము షార్జాలో ఉంటాం. ఎప్పుడు ఇలా బియ్యం ధరలు పెరగలేదు. చాలా మంది లేబర్ పనిచేసుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. మన దేశం నుంచి బియ్యం వస్తేనే ధరలు తగ్గుతాయి. తక్కువ జీతం ఉన్న వారు రోటీలు కొనుక్కుని తింటున్నారు. – పరస తిరుపతి, గల్ఫ్ కార్మిక సంఘం కార్యదర్శి

లేబర్లపైనే అధిక భారం



కూలీలు, తక్కువ వేతనాలకు పనిచేసే వలస జీవులపై బియ్యం ధరలు అధిక భారాన్ని మోపుతున్నాయి. కేంద్రం వెంటనే ఎగుమతులపై నిషేధాన్ని తొలగించాలి. దుబాయిలోని చాలా మార్కెట్లలో ధరలు పెంచారు. దీంతో సగటు వలస జీవి బియ్యం కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. – బాలకిషన్, దుబాయి

కాషాయ జెండా ఎగురవేయాలి

- బీజేపీ కర్నాటక ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్
- ఎల్లారెడ్డిపేటలో కార్యకర్తల సమావేశం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని బీజేపీ కర్నాటక ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ధీరజ్ మునిరాజ్ మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో బూత్‌లను పటిష్టం చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో సిరిసిల్లలో కాషాయం జెండా ఎగురవేయాలని కోరారు. బీఆర్‌ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రవాస్ యోజనలో భాగంగా పలువురు ప్రముఖులను ఎమ్మెల్యే కలిసి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వరరెడ్డి,చక్రధర్‌రెడ్డి,రామాకాంత్‌రావు,ఆడేపు రవీందర్,శీలం రాజు,మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్

ఆధ్యాత్మికతతోనే పల్లెల్లో ఆనందం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- పుట్టల ఎల్లమ్మ విగ్రహావిష్కరణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆధ్యాత్మిక చింతనతోనే ఆనందం వెల్లివిరుస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఆవునూర్ ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పుట్టల ఎల్లమ్మ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. వేలాది ఆలయాలను పునరుద్ధరించి.. ధూప, దీప నైవేద్యాలను అందిస్తున్నామన్నారు. ఎల్లమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన పదిర నాయకుడు మల్లారెడ్డిని అభినందించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్లు శ్రీనివాస్, మోహన్, సింగిల్‌విండో చైర్మన్ బాపురావు, సర్పంచులు కల్యాణి, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ లలిత, గౌడ సంఘం బాధ్యులు చంద్రశేఖర్, బాలకృష్ణ, బైరి శ్రీను, రాజాగౌడ్, రమేశ్, దేవయ్య, బాలరాజు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న తోట ఆగయ్య

రెగ్యులరైజ్ చేయాలి

- ఏఎన్‌ఎంలను కించపరుస్తున్న సర్కారు
- ప్రత్యేక కమిటీతో సమస్యలు పరిష్కరించాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగానే తెలంగాణలోనూ రెండో ఏఎన్‌ఎంల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఆరు రోజులుగా సిరిసిల్లలో నిరవధిక దీక్షలు చేపడుతున్న రెండో ఏఎన్‌ఎంలకు సోమవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆరోగ్యశాఖలో పనిచేసే ఏఎన్‌ఎంలు ఎవరైనా ఏఎన్‌ఎంలే ఇందులో మొదటి, రెండో ఏఎన్‌ఎంలు అంటూ..వారిని ప్రభుత్వం అగౌరవ పర్చడం సరికాదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. సమాన పనికి సమాన వేతనం అవసరమన్నారు. సీనియర్ నాయకులు సామల మల్లేశం, కడారి రాములు ఉన్నారు.



మద్దతుగా మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

బోనాలతో నిరసన

సిరిసిల్లలో రెండో ఏఎన్‌ఎంలు బోనాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాతబస్టాండు, ప్రధాన వీధుల్లో నెత్తిన బోనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఎనగందుల వెంకన్న, లింగంపల్లి మధుకర్ తదితరులు రెండో ఏఎన్‌ఎంల దీక్షలకు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి, రేఖ, రాజేశ్వరి, పద్మ, సరోజ, ఇందిర, కరుణశ్రీ, సునంద తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లిలోని రైతువేదిక భవనంలో ఈనెల 23న వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సెస్ ఎండీ రామకృష్ణ, బోయినపల్లి సెస్ ఏఏఈ ప్రశాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వే ములవాడ సబ్‌డివిజన్ పరిధిలోని వేములవాడటౌన్, వేములవాడరూరల్, చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల పరిధిలోని సెస్ వినియోగదారులు తమకు సంబంధించిన విద్యుత్ సమస్యలు తెలపాలని కోరారు. సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ చైర్మన్ ఈశ్వరయ్య హాజరవుతారని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల సెస్ వినియోగదారులు ఈ పరిష్కార వేదికను వినియోగించుకోవాలని సెస్ ఎండీ రామకృష్ణ, ఏఏఈ ప్రశాంత్ కోరారు.

పదోన్నతులు చేపట్టాలి

కోనరావుపేట(వేములవాడ): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల కోడ్‌కు ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి కోరారు. కోనరావుపేటలో సోమవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేవన్నారు. ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు సూగూరి దేవేందర్, జిల్లా నాయకులు సత్తు రవీందర్, మిట్టపెల్లి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ గుజ్జునేని వేణుగోపాల్‌రావు, సుల్తాన్ శ్రీనివాస్, రాజేందర్, శ్రీపతి భూమేశ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

బీజేపీ కీలకనేత రాజీనామా?

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలానికి చెందిన బీజేపీ మండల స్థాయి కీలకనేత పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది. కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన రాజీనామా చేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. జిల్లా స్థాయి నాయకుల మధ్య ఏర్పడిన విభేదాలు, వ్యక్తిగత కారణాలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఆహ్వానం పంపినట్లు తెలిసింది. ముందుగా రాజీనామా చేసిన తర్వాతనే తన అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ వేములవాడ రూరల్ మండలం నుంచి కీలక పదవిలో ఉన్న ఏకైక వ్యక్తి ఆ పార్టీకి రాజీనామా చేయడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం ఆగదని బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క బాలమల్లేశ్ కోరారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమల్లేశ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తానని చెప్పి పూర్తి స్థాయిలో కేటాయించడం లేదన్నారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు, నాయకులు శంకర్, భూమిరెడ్డి, అంజన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మంద సుదర్శన్, తదితరులు ఉన్నారు.

డ్రోన్‌తో పొలాలకు యూరియా

ముస్తాబాద్(సిరిసిల్ల): డ్రోన్‌తో ఆధునిక పద్ధతుల్లో పొలాలకు యూరియా చల్లే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు కోరారు. మోహినికుంటలో ఇఫ్కో ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను సోమవారం ప్రారంభించారు. రైతులకు శ్రమ లేకుండా, తక్కువ సమయంలోనే నానో యూరియా, ఇతర రసాయనాలను పిచికారీ చేసేలా రూపొందించినట్లు తెలిపారు. శ్రీనివాస్, ఎల్లం రైతులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో యూరియా చల్లుతున్న రైతులు

మాట్లాడాలని పిలిచి.. కర్రలతో కొట్టి..

- మెట్‌పల్లిలో యువకుడి దారుణ హత్య
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- పాత కక్షల నేపథ్యంలోనే ఘటన..!
- మృతదేహంతో కాలనీవాసుల ఆందోళన
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- నాలుగు రోజుల వ్యవధిలో రెండు మర్డర్లు
- భయం గుప్పిట్లో పట్టణవాసులు



సతీశ్(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): ఆదివారం రాత్రి సుమారు 11.30గంటల సమయం.. మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ అది.. దాని చెంతనే నిర్మానుష్య ప్రదేశం.. ఇద్దరు స్నేహితులు కస్నం సతీశ్, నిఖిల్ అక్కడ కూర్చొని ఏదో విషయంపై మాట్లాడుకుంటున్నారు.. సరిగ్గా అదే సమయంలో ఇద్దరు అక్కడకు చేరుకున్నారు.. సతీశ్‌ను తమ వద్దకు రావాలని పిలిచారు. వారి వద్దకు వెళ్లిన సతీశ్ భుజంపై చెయ్యి వేసి కొద్దిదూరం నడుచుకుంటూ తీసుకెళ్లారు.. ఆ వెంటనే ఒక్కసారిగా దాడికి దిగారు.. అప్రమత్తమైన సతీశ్.. వారి బారి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు.. నిఖిల్ అడ్డుకునేందుకు యత్నించగా.. దుండగులు చంపుతామని బెదిరించి అక్కడి నుంచి పంపించి వేశారు. గాయాలతో పారిపోతున్న సతీశ్‌ను వెంబడించి కట్టెలు, ఇటుకలతో విచక్షణ రహితంగా కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న సతీశ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నాలుగు రోజుల క్రితమే కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు రజాక్ కూడా హత్యకు గురయ్యాడు. ఈ కేసుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సమయంలోనే సతీశ్ హత్యకు గురికావడం అలజడి సృష్టించింది. ప్రశాంతంగా ఉన్న పట్టణంలో వరుస హత్యలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆ సంఘటనే కారణమా?

- పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సతీశ్(27)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరి వయసు ఏడాదిన్నర కాగా, మరొకరి వయసు రెండు నెలలు.
- జక్కం రాజేశ్, నవీన్ కలిసి సతీశ్‌పై దాడిచేసి చంపారని ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటస్వామి సోమవారం విలేకరులకు తెలిపారు.
- అయితే.. పాత పగతోనే రాజేశ్ తన మిత్రుడు నవీన్‌తో కలిసి సతీశ్‌ను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం స్థానిక మినీస్టేడియంలో రాజేశ్, సతీశ్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- చాలారోజుల తర్వాత రాజేశ్ కోలుకున్నాడు. అప్పటి నుంచి సతీశ్‌పై కక్ష పెంచుకున్నాడు. అదను చూసి హతమార్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.
- కేవలం ఈ గొడవేనా.. ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

మృతదేహంతో కాలనీవాసుల ఆందోళన

సతీశ్ మరణవార్త తెలుసుకున్న కాలనీవాసులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈనేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రంగంలోకి దిగిన ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటస్వామి.. కోరుట్ల, మెట్‌పల్లి సీఐలతోపాటు పలువురు ఎస్‌ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక అంబులెన్స్‌లో మృతుడి ఇంటికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై కాలనీవాసులు ఆందోళనకు దిగారు. దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హంతకులను పట్టుకోవడానికి రెండు బృందాలు

- మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు.
- దోషులను పట్టుకోవడానికి ప్రత్యేకంగా రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.
- సతీశ్‌ను కొట్టి చంపిన బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి.
- వాటిలో ఈ దృశ్యాలు నిక్షిప్తమై ఉంటాయని భావించిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు.